సాక్షి గుంటూరు

సోమవారం । 22 । జూలై । 2024



ముత్యాలమ్మ బోనాలు

రెంటచింతల: ఆషాఢ మాసం సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలను సమర్పించారు.



సాగర్‌లో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయానికి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దివ్యబలిపూజ, తేరు ప్రదక్షిణ నిర్వహించారు.



హెల్మెట్ ధరించండి

పిడుగురాళ్ల: హెల్మెట్ ధారణపై పిడుగురాళ్లలో ఆదివారం వాహన చోదకులకు న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యాన అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

శాకంబరిగా భ్రమరాంబ



పెదకాకాని : భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం భ్రమరాంబ అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కదంబ ప్రసాద వితరణ చేశారు. సోమవారం కూడా అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిస్తారని ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు వెల్లడించారు. అమ్మవారి అలంకరణకు ఆకుకూరలు, కూరగాయలను పెదకాకానికి చెందిన వీరిశెట్టి లక్ష్మీనారాయణ అందజేశారని వివరించారు. అమ్మవారికి ఆదివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆషాఢసారె సమర్పించారు.

అసెంబ్లీ సమావేశాల బందోబస్తు పరిశీలన



తాడికొండ : సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సచివాలయం, అసెంబ్లీ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు వచ్చే మార్గాలలో ఎటువంటి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వెలగపూడి సచివాలయం, పరిసర ప్రాంతాల్లో అధికారులతో కలిసి హెలిప్యాడ్ ప్రాంతం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, సిబ్బంది అలసత్వం లేకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసరావు, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, ఎఆర్ డీఎస్పీ శ్రీ శాంత కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆనంద్, సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కలుషిత ఆహారంతో నలుగురికి అస్వస్థత



దగ్గుబాడు (కారంచేడు): కలుషిత ఆహారం తిని నలుగురు వ్యక్తులు అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం మండలంలోని దగ్గుబాడు ముస్లిం కాలనీలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, సుహానా దంపతులకు షాహిద్, ఫాతిమా అనే పిల్లలున్నారు. వీరంతా శనివారం రాత్రి ఇంట్లో వండిన వంకాయ కూరతో అన్నం తిన్నారు. ఆదివారం ఉదయం లేచిన తరువాత దోశలు తిన్నారు. వీటిలో ఏ ఆహారం కలుషితమైందో తెలియదు గానీ అనంతరం వాంతులు, విరేచనాలతో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో గ్రామస్తులు చీరాలకు చెందిన ఓ ఆస్పత్రి గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి తీసుకెళ్లారు. డాక్టర్ పృథ్వీ పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం వారిని ఇంకొల్లుకు పంపించినట్లు గ్రామస్తులు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,700, ఎడమ కాలువకు 3,146, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

ఈ-క్రాప్ నమోదు లేనట్టేనా!

- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- జిల్లాలో ముమ్మరంగా ఖరీఫ్ పంటల సాగు
- సాధారణ సాగు విస్తీర్ణం 1.26 లక్షల హెక్టార్లు
- ఇంతవరకు సాగైనది 34,867 హెక్టార్లు
- ఈ-క్రాప్ నమోదు లేక రైతుల్లో ఆందోళన
- రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం అందదన్న బెంగ
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఠంఛన్‌గా ఈ-క్రాప్ నమోదు
- ఈ-క్రాప్ నమోదు ఆధారంగా రైతులకు అందిన సాయం



ఈ-పంట నమోదు చేస్తున్న వీఏఏలు (ఫైల్)

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగుకు ఉపక్రమించారు. అదును చూసుకుని విత్తనాలు విత్తుతున్నారు. ఖరీఫ్ పనుల్లో అన్నదాతలు బిజీ అయ్యారు. ఏటా పంటల సాగు సమయంలో పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బంది ఇప్పుడు కనిపించక పోవడంతో కలవరపడుతున్నారు. ఈ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని బెంగపడుతున్నారు. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని ఆరా తీస్తున్నారు. వారి వద్ద కూడా సరైన సమాధానం లేకపోవడంతో దిగులు చెందుతున్నారు. పంట సాగుకు ఎరువులు కొనాలన్నా, పంటను విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు పంటల బీమా పొందాలన్నా ఈ-క్రాప్ ఉపయోగపడుతుందని, ఇంతటి ప్రాధాన్యమున్న పంటల నమోదు కార్యక్రమంపై ప్రభుత్వం ఆలస్యం చేయడాన్ని తప్పుపడుతున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి భరోసా అందేదని, కొత్త ప్రభుత్వం కొలువుదీరి రోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం అందే దారి కనిపించడంలేదంటూ ఆవేదన చెందుతున్నారు.

గతంలో ఇలా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసేది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ ప్రక్రియను నిర్వహించేవారు. పంట సాగు చేసిన రైతులను పొలం వద్ద నిలబెట్టి పంటతోపాటు ఫొటో తీసి యాప్‌లో వివరాలు నమోదు చేసేవారు. ఈ-క్రాప్ ఆధారంగానే ఎరువులు, ఇతర సాగు సాయాన్ని వ్యవసాయ సిబ్బంది అందించేవారు. రైతులు పండించిన పంటను కూడా ఈ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలు ఇలా...

- పంటల బీమా వర్తిస్తుంది.
- పంట రుణాలు మంజూరవుతాయి.
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుతుంది.
- పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు.

మార్గదర్శకాలు రాలేదు



ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంతవరకు గైడ్ లైన్స్ రాలేదు. వచ్చిన తర్వాత వాటి ఆధారంగా పంట నమోదుకు చర్యలు తీసుకుంటాం.

–నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి.

పంటల సాగు విస్తీర్ణం 1.26 లక్షల హెక్టార్లు

జిల్లాలో 2024–25 సంవత్సరానికి సంబంధించి పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.26 లక్షల హెక్టార్లు. ఇందులో ఇంతవరకు 34,867 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వరి పంట సాధారణ విస్తీర్ణం 63,733 హెక్టార్లు కాగా ఇంతవరకు 19,257 హెక్టార్లలో రైతులు వెద పద్ధతిలో సాగు చేశారు. 10 వేల హెక్టార్లకు సరిపడా నారుమడులు సిద్ధం చేశారు. పత్తి పంట సాధారణ విస్తీర్ణం 26,982 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 8,601 హెక్టార్లలో సాగైంది. అలాగే కూరగాయల పంటలు 1,073 హెక్టార్లలో, మినుము 551 హెక్టార్లలో, పిల్లిపెసర 2,151 హెక్టార్లలో, సోయాబిన్ 83, పెసర 17, నువ్వులు 78, జూట్ 34, మిరప 22, మొక్కజొన్న 9, ఇతర పంటలు 2,095 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

రషీద్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యే

- టీడీపీ తాజా, మాజీ ఎమ్మెల్యేల ప్రోత్సాహంతోనే దురాగతం
- హోంమంత్రి మాట్లాడే తీరు సరిగాలేదు
- మాజీ సీఎం జగన్‌పై ఆమె వ్యాఖ్యలు అనుచితం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, చిత్రంలో రాజనారాయణ, మామిడి రాము

నగరంపాలెం(గుంటూరువెస్ట్): ఇటీవల పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీ కార్యకర్త చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. గుంటూరు విద్యానగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. ''ఇది రాజకీయ హత్యకాదు.. ఇద్దరు మిత్రుల మధ్య తలెత్తిన విభేదాల వల్ల జరిగిన హత్య'' అని పోలీసులు, ప్రభుత్వం మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. నిందితుడు జిలానీ ప్రస్తుతం టీడీపీలో ఉన్నాడని తెలిపారు. మంత్రులు పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తరహాలోనే జిలానీ టీడీపీలోకి వెళ్లాడని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలోకి వెళ్లాక వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రోద్బలంతో రషీద్‌ను హత్య చేశాడని స్పష్టం చేశారు. రషీద్‌కు నేరచరిత్ర లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తే టీడీపీ తట్టుకోలేకపోయిందని అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. రషీద్ హత్య వ్యక్తిగతమైతే అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే, ఎంపీ ఇప్పటి వరకు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్‌లోనూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులపై రషీద్ కుటుంబ సభ్యులు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఈ హత్య గంజాయి మత్తులో జరిగిందని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం చేపట్టి 45 రోజులవుతుందని, గంజాయిపై పోలీస్ వ్యవస్థ ఏం చేస్తోందని, రాష్ట్రంలో గంజాయి ఉందని హోంమంత్రి అంగీకరించినట్లేనా అని ప్రశ్నించారు.

బాలిక మృతదేహాన్ని ఎందుకు గుర్తించలేదు

ఈనెల 7న మచ్చుమర్రి ప్రాంతంలో ఓ బాలికపై లైంగికదాడి జరిపి హత్య చేసి మృతదేహం కృష్ణానదిలో పడేశారనే కథనాలు వినిపిస్తున్నాయని, ఇప్పటిదాకా మృతదేహాన్ని ఎందుకు గుర్తించలేకపోయారని అంబటి రాంబాబు హోంమంత్రిని ప్రశ్నించారు. ఈ కేసులో అనుమానితుడిని తీసుకువస్తే చనిపోయాడని, ఇది ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. దీనిపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్‌చేశారు. దీన్ని సుమోటోగా తీసుకుని విచారణ చేయాలని కోరారు.

హోంమంత్రి వ్యాఖ్యలు సరికావు

పులివెందుల ఎమ్మెల్యే అంటూ వైఎస్ జగన్‌ను రాష్ట్ర హోంమంత్రి అనిత సంబోధించడం సరికాదని అంబటి రాంబాబు పేర్కొన్నారు. మాజీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనిత తన పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. 36 రాజకీయ హత్యలు, విధ్వంసాలు, దాడులు, ఇతర నేరాల జాబితా మొత్తం కేంద్ర హోంమంత్రికి ఇస్తామని రాంబాబు బదులిచ్చారు. శాంతిభద్రతల రక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ విషయం ప్రజలకూ అర్థమైందని పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అమిత ప్రజాదరణ కలిగిన వ్యక్తని రాంబాబు చెప్పారు. ఆయన బయటకు వచ్చి ప్రజలకు సర్కారు వైఫల్యాలను వివరిస్తే టీడీపీ ప్రభుత్వ పునాదులు కదులుతాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపైనా తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. సమావేశంలో మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మామిడి రాము పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డిపై కేసులు దుర్మార్గం

పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికెళ్తే టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడి వాహనాలన్నీ ధ్వంసం చేశారని అంబటి రాంబాబు చెప్పారు. టీడీపీ కార్యకర్తలను వదిలి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, మరో 60 మందిపై 307 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర హోం మంత్రి అనిత మరింత చురుగ్గా పని చేయాలని చంద్రబాబు వ్యాఖ్యానించారంటే ఆమె ఆ పదవికి తగరని చంద్రబాబు పరోక్షంగా చెప్పినట్లే ఉందని రాంబాబు ఎద్దేవా చేశారు.

పాఠశాలల్లో 'శిక్ష సప్తాహ్'



గుంటూరులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)

- నేటి నుంచి వారోత్సవాలు ప్రారంభం
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికుల భాగస్వామ్యంతో కార్యక్రమాల నిర్వహణ
- ఈనెల 28 వరకు అంశాలవారీ ప్రదర్శన, చర్చ
- జాతీయ నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సమగ్రశిక్ష మార్గదర్శకాలు
- విద్యతోపాటు నైపుణ్యాలను ప్రతిబింబించే రీతిలో కార్యక్రమాల నిర్వహణకు కసరత్తు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ నూతన విద్యా విధానం (ఎన్ఈపీ–2020) అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తవుతోంది. కరిక్యులమ్ రూపకల్పన, సిలబస్ కూర్పు, బోధన, పరీక్షల నిర్వహణ విధానంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వారోత్సవాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ''శిక్ష సప్తాహ్'' పేరుతో వివిధ కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర సమగ్రశిక్ష విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాలల్లో ఆయా కార్యక్రమాలను నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది.

సంస్కరణలకు అద్దంపట్టేలా

జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత వచ్చిన పరివర్తనాత్మక సంస్కరణలతోపాటు దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధిలో నిబద్ధతను తెలియజేసే దిశగా కార్యక్రమాలను రూపొందించారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వాములు కావాల్సి ఉంది. శిక్ష సప్తాహ్‌లో భాగంగా వారం రోజులపాటు చేపట్టాల్సిన అంశాలవారీ కార్యక్రమాల ప్రణాళిక ఇదీ..

జూలై 22: బోధన సామగ్రి ప్రదర్శన

ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధన, అభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు ఇందులో భాగస్వాములవుతారు.

జూలై 23: పునాది అభ్యసన

ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం దోహదపడుతుంది. గణితంలోని సంఖ్యాశాస్త్రం ద్వారా నైపుణ్యాల అభివృద్ధి అమలుపై చర్చిస్తారు.

జూలై 24: క్రీడా దినోత్సవం

విద్యార్థులకు క్రీడలు, శారీరక దారుఢ్యం ప్రాముఖ్యం తెలియజేసేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తారు.

జూలై 25: సాంస్కృతిక దినోత్సవం

విద్యార్థుల్లో భిన్నత్వంలోఏకత్వ భావాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా విచిత్ర వస్త్రధారణ, పాటల పోటీలు, నృత్య, నాటికలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

జూలై 26: సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

స్కిల్, డిజిటల్ ఇన్షియేటివ్ పేరుతో ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతుల విద్యార్థులకు నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం, విద్యలో సాంకేతిక అభివృద్ధి అంశాలపై చర్చిస్తారు.

జూలై 27: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు (మిషన్ లైఫ్ ఆక్టివిటీస్)లో భాగంగా పాఠశాలలో పోషణ దినోత్సవం నిర్వహణ, కొత్తగా ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన కల్పించడంతోపాటు పాఠశాలలో కనీసం 35 మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తారు.

జూలై 28: సామాజిక భాగస్వామ్య దినోత్సవం

విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంచేందుకు పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసే విధంగా సమష్టిగా కృషి చేయడంపై చర్చిస్తారు.

అన్ని పాఠశాలల్లో వారోత్సవాలు



రాష్ట్ర సమగ్రశిక్ష విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు శిక్ష సప్తాహ్ వారోత్సవాలను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకుని ఆయా కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా పర్యవేక్షించాలి.

– పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి, గుంటూరు

ఉత్సాహంగా బ్రెయిన్ హెల్త్ వాక్



ర్యాలీని ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణకు బొకే అందజేస్తున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: బ్రెయిన్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి ఆధునిక చికిత్స విధానాలను తెలియజేసేందుకు ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో 'ప్రతి ఒక్కరికీ బ్రెయిన్ హెల్త్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. గుంటూరు ఐటీసీ హోటల్ నుంచి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వరకు జరిగిన బ్రెయిన్ హెల్త్ వాక్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్లకార్డులు, బ్యానర్లు ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ మాట్లాడుతూ ముందు జాగ్రత్తలతో మెదడు సమస్యలు రాకుండా నివారించవచ్చునని పేర్కొన్నారు. ర్యాలీలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్ కుమార్, ఏపీ న్యూరో కాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.రామ్‌తారక్‌నాథ్, ఏపీ ఎన్ఎస్ఏ కోశాధికారి డాక్టర్ ఎ.వి.రమణమూర్తి, డాక్టర్ సి.హెచ్.సీతారామ్, డాక్టర్ మానసకుమార్, డాక్టర్ ఎస్.గోపి, డాక్టర్ బి.ఎస్.రెడ్డి, డాక్టర్ ఎం.వి.విజయశేఖర్, డాక్టర్ కోదాడ గిరిరావు, డాక్టర్ ఎన్.ఎస్.సంపత్‌కుమార్, జీజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పలపాటి అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మదా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు చివరి రోజు సీఎంఈల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన న్యూరాలజిస్టు డాక్టర్ సుభాష్‌కౌల్, చెన్నై రాయవెల్లూరుకు చెందిన డాక్టర్ సంజీత్‌ఆరోన్‌లు బ్రెయిన్ స్ట్రోక్‌లో వచ్చిన అత్యాధునిక చికిత్సా విధానాల గురించి వివరించారు. సదస్సు ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.రామ్‌తారకనాథ్, వెర్టిగో చికిత్సలో ఆధునిక వైద్య పద్ధతులను వీడియోల రూపంలో ప్రదర్శించారు.



మెరిసాయి కోవెలలు

గురుపూర్ణిమ సందర్భంగా సాయి కోవెలలు వెన్నెలీనినట్టు మెరిశాయి. అలంకరణల్లో ధగధగలాడాయి. జిల్లావ్యాప్తంగా భక్తిపారవశ్యం పరవళ్లు తొక్కింది. భక్తులు భారీగా షిరిడీ సాయిబాబా ఆలయాలకు పోటెత్తి.. ప్రత్యేక పూజలు చేశారు. గుంటూరు అరండల్‌పేట సాయిబాబా మందిరంలో కొలువైన స్వామిని, దర్శించుకుంటున్న భక్తులను చిత్రాల్లో చూడొచ్చు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



క్లుప్తంగా

మంత్రి అనగానిని కలిసిన దర్శకుడు దిలీప్‌రాజా



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆంధ్రాలో షూటింగ్‌లు చేసే సినిమాల రెవెన్యూ తెలంగాణకు వెళ్లకుండా యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరినట్లు దర్శకుడు, మా–ఏపీ వ్యవస్థాపకులు దిలీప్ రాజా తెలిపారు. గుంటూరు కన్నవారితోటలోని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నివాసంలో ఆదివారం మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను దిలీప్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సినీ పరిశ్రమ అభివృద్ధిపై మంత్రితో చర్చించినట్లు ఆయన వెల్లడించారు.

కొల్లిపరలో 12.2 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 12.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.8 మి.మీ వాన కురిసింది. సగటున 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. ప్రత్తిపాడు 7.4, దుగ్గిరాల 6.8, తుళ్ళూరు 5.2, చేబ్రోలు 5, మేడికొండూరు 4.8, పొన్నూరు 4, ఫిరంగిపురం 3.8, తాడేపల్లి 3.6, మంగళగిరి 3, పెదకాకాని 3, వట్టిచెరుకూరు 3, తెనాలి 3, పెదనందిపాడు 2.6, గుంటూరు పశ్చిమ 2.4, తాడికొండ 2.2, కాకుమాను మండలంలో 2 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై 21 నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 111.2 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 188.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వసతి గృహాల్లో విద్యార్థుల ఆందోళన

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. మెస్‌లో పనిచేసే కొందరు సిబ్బంది వసతి గృహాల్లో వండిన ఆహారాన్ని బయటకు తరలించడాన్ని విద్యార్థులు గుర్తించారు. తమకు అందించాల్సిన ఆహారాన్ని బయటకు ఎందుకు తరలిస్తున్నారని, ఇదేమి పని అంటూ నిలదీశారు. విద్యార్థుల కోసం పనిచేయాల్సిన సిబ్బంది విద్యార్థుల ఆహారాన్ని బయటకు తీసుకెళ్లడం ఏమిటని నిలదీస్తూ, నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సిబ్బంది చేస్తున్న అవినీతి వ్యవహారాలకు అధికారులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ ఘటనను సోమవారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిరసన తెలిపేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

24న గ్రంథాలయ సేవాపురస్కారాలు ప్రదానం

- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ఆచంట రజనీకుమారి ఎంపిక
- గుంటూరు వేదికగా ప్రదానోత్సవ సభ



ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి



ఆచంట రజనీకుమారి

తెనాలి: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య వెలిగించిన గ్రంథాలయ జ్యోతిని మరో తరానికి అందించిన క్రియాశీలి డాక్టర్ వెలగా వెంకటప్పయ్యల గ్రంథాలయ సేవాపురస్కార సభ ఈనెల 24న గుంటూరులో జరగనుంది. బృందావన్ గార్డెన్స్‌లోని కంచికామకోటిపీఠ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు జరిగే సభలో ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ఆచంట రజనీకుమారిలకు పురస్కారాలను అందజేస్తారు. ఇదే వేదికపై 'నేటి తరుణంలో పుస్తక భవితవ్యం' అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ కొలా ధర్మనిధి ఉపన్యాసం ఉంటుంది. అన్నమయ్య సేవాసమితి ఆధ్వర్యంలో జరిగే సభకు చిటిపోతు మస్తానయ్య అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కేజీ శంకర్, ముస్సోరీలోని లాల్‌బహదూర్ అకాడమీ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ ఆరేటి కృష్ణకుమారి చేతులమీదుగా సేవా పురస్కారాలను బహూకరిస్తారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆచార్య అయ్యంకి మురళీకృష్ణ, ప్రవాస భారతీయుడు డాక్టర్ వెలగా నాగార్జున, అయ్యంకి–వెలగా పురస్కార కమిటీ కన్వీనర్ పావులూరి శ్రీనివాసరావు పాల్గొంటారు. 2008 నుంచి ఈ గ్రంథాలయ సేవాపురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.

'సారస్వత కళానిధి' ఆచార్య వెలువోలు

ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి స్వస్థలం బాపట్ల జిల్లా అమృతలూరు. ప్రస్తుతం గుంటూరులో ఉంటున్నారు. తెలుగు సాహిత్యరంగంలో అద్వితీయమైన కృషి చేసి 'సారస్వత కళానిధి'గా గౌరవాన్ని పొందారు. ప్రబంధయుగం, అష్టాదశ వర్ణనలపై పరిశోధనచేసి డాక్టరేట్‌ను స్వీకరించారు. భాషాపరిశోధకురాలిగా, అవధాన కార్యక్రమాల్లో పృచ్ఛకురాలిగా, బహుగ్రంథకర్తగా చేసిన కృషి గొప్పది. ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తూ సాహిత్య, ధార్మిక కార్యక్రమాలకు ప్రయోక్తగా రాణిస్తున్నారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లో భక్తి, సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక, సాహిత్య రూపకాలను అందించారు. గుంటూరు జిల్లాలోని చైల్డ్ వెల్ఫేర్ సంస్థ పర్యవేక్షకురాలిగా పలు సంస్కరణలను ప్రవేశపెట్టారు. టీటీడీ ఆస్థాన పండిత పరిషత్ సభ్యురాలిగా సప్తగిరి పత్రిక సంపాదకవర్గ సభ్యులుగా, రాష్ట్ర రచయితల సంఘ ఉపాధ్యక్షులుగా, ఏఎన్‌యూ దూర విద్య విభాగ గౌరవ అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. దాదాపు 20 గ్రంథాలను రచించారు. తెలుగు, సంస్కృత అధ్యాపకురాలిగా, కాలేజి ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పనిచేశారు. ప్రస్తుతం ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధకులకు పర్యవేక్షకులుగా ఉన్నారు.

గ్రంథాలయ సమాచార శాస్త్రం పరిశోధకురాలు రజనీకుమారి

ఆచంట రజనీకుమారి వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి ప్రధాన గ్రంథాలయ అధికారిగా సేవలందిస్తున్నారు. 1969లో జన్మించారు. తెనాలి రూరల్ మండలంలోని సంగం జాగర్లమూడిలోని హైస్కూలు విద్యను, చేబ్రోలు డిగ్రీ కాలేజిలో బీకాం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఏ (సోషియాలజీ) చేశారు. అన్నామలై విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ సమాచార శాస్త్రంలో పీజీ పూర్తిచేశారు. హైదరాబాద్‌లో పీజీడీఎల్‌ఏఎస్ చేసి, అలగప్పా విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ చేశారు. ప్రస్తుతం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్సెస్‌లో పరిశోధనలో ఉన్నారు. స్వయంగా రాష్ట్రీయ, జాతీయ సదస్సును నిర్వహించారు. ఏపీఎల్‌ఏ శాశ్వత సభ్యురాలిగా గుర్తింపును పొందారు. పలు విశ్వవిద్యాలయాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొని గ్రంథాలయ అభివృద్ధిపై అనేక పత్రసమర్పణలు చేశారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ముగ్గురు
- పరారీలో మరో నలుగురు
- డీఎస్పీ రమేష్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐలు వెంకటేశ్వర్లు, దశరథరామారావు, ఎస్‌ఐ కోటేశ్వరరావు

తెనాలిరూరల్: విద్యార్థులు, యువతే లక్ష్యంగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠా సభ్యులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ఏడుగురు సభ్యులుగా ఉండగా, నలుగురు పరారీలో ఉన్నారు. తెనాలి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. తెనాలి మండలం కఠెవరం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారని రూరల్ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పి.కోటేశ్వరరావులకు పక్కా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన వారు సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. బాపట్ల పట్టణానికి చెందిన అల్లుమోలు మణికుమార్‌రెడ్డి, విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో ఉంటున్న మంగళగిరికి చెందిన తాడిశెట్టి జోసఫ్ అలియాస్ మనోహర్, కఠెవరానికి చెందిన బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కఠెవరంలో అద్దెకు ఉంటున్న షేక్ ఇమ్రాన్‌కు మణికుమార్‌రెడ్డి, జోసఫ్, బాలుడితో పరిచయమైంది. ఇమ్రాన్ విశాఖ జిల్లా నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న పొట్లాలు కట్టి తన స్నేహితులు ముగ్గురికి ఇచ్చి విక్రయించేందుకు పంపేవాడు. మణికుమార్‌రెడ్డికి పరిచయమున్న యర్రబాలెంకు చెందిన భార్గవ్‌ప్రశాంత్, మంగళగిరికి చెందిన తిరువీధుల సాయికృష్ణ, ఖగ్గా తిరుపతయ్యలకూ విక్రయించేవారు. ఈ నేపథ్యంలో శనివారం కఠెవరంలోని ఇమ్రాన్ గదిలో గంజాయిని పొట్లాలు కడుతుండగా పోలీసులు దాడి చేసి మణికుమార్‌రెడ్డి, జోసఫ్, బాలుడిని పట్టుకున్నారు. ఇమ్రాన్, భార్గవ్‌ప్రశాంత్, తిరువీధుల సాయికృష్ణ, ఖగ్గా తిరుపతయ్య పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. తెనాలి సబ్‌డివిజన్ డీఎస్పీగా తాను బాధ్యతలు చేపట్టిన ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు గంజాయి కేసుల్లో 50 మందిని అరెస్ట్ చేశామని, గంజాయి విక్రయాలు, వినియోగాన్ని సహించేది లేదని డీఎస్పీ రమేష్ స్పష్టం చేశారు. గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ కోటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ వాకా రవి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రాము, రాజేష్‌కుమార్‌ను ఆయన అభినందించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ జి. దశరథరామారావు ఉన్నారు.

జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలిగా భవానీదేవి



భవానీదేవి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో ఆదివారం గుంటూరు జిల్లా రచయితల సంఘం అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన విదుషీమణి, ప్రముఖ రచయిత్రి డా.సి.భవానీదేవిని జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని తెలిపారు. సోమేపల్లి వెంకటసుబ్బయ్య మరణంతో ఖాళీ ఏర్పడిన అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఆమెను ఎన్నుకున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు జిల్లా రచయితల సంఘం తరఫున రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని సంఘ సభ్యులు కోరారు. ఇటీవల మరణించిన ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నంకు నివాళులర్పించారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు కె.జె.రమేష్, కోశాధికారి నానా, సహాయ కార్యదర్శి ఈవూరి వెంకటరెడ్డి, సభ్యులు కొణతం నాగేశ్వరరావు, డా.టి.గోవిందయ్య, తాటికోల పద్మావతి పాల్గొనగా, అధ్యక్షురాలుగా ఎన్నికైన డా.సి.భవానీదేవిని సంఘ సభ్యులు అభినందించారు.

ప్రియుడి మోజులో చిన్నారులకు తల్లి వేధింపులు

మాచర్ల రూరల్: ప్రియుడి మోజులో పడి తల్లి పెడుతున్న వేధింపులు తాళలేక తిరుపతి నుంచి పారిపోయి వచ్చిన చిన్నారులు చివరికి పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. మాచర్ల రూరల్ ఎస్‌ఐ కె. రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు... మాచర్ల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహేష్, సాగరమ్మలకు కుమార్తె (11), కుమారుడు (8) సంతానం. సాగరమ్మ మాచర్ల పట్టణానికి చెందిన మల్లెల షఫీతో తిరుపతిలో సహజీవనం చేస్తోంది. మల్లెల షఫీ గతంలో ట్రాన్స్‌జెండర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని కొంత నగదు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. షఫీ మద్యం తాగి వచ్చినప్పుడు సాగరమ్మతో కలిసి తరచూ చిన్నారులను తమకు అడ్డుగా ఉన్నారని వేధించేవాడు. తట్టుకోలేక చిన్నారులు శుక్రవారం తిరుపతిలో రైలు ఎక్కి శనివారం ఉదయం గుంటూరు చేరుకున్నారు. అక్కడి రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే బంధువుల సాయంతో తండ్రికి సమాచారం అందించారు. తండ్రి తన చిన్నారులను తీసుకొని స్వగ్రామం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో సాగరమ్మ చిన్నారుల మిస్సింగ్‌పై తిరుపతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్వగ్రామం చేరుకుంటారని ఆమె అనుమానం వ్యక్తం చేయడంతో తిరుపతి పోలీసుల సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ ఆ చిన్నారులను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. షఫీకి మద్దతుగా ట్రాన్స్‌జెండర్లు పెద్దఎత్తున స్టేషన్ వద్దకు చేరుకొని గందరగోళం సృష్టించారు. కుటుంబసభ్యుల సమక్షంలో సాగరమ్మకు కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు మహేష్‌తో కలిపారు. అనంతరం దంపతులకు పిల్లలను అప్పగించారు.

అద్భుతాలను ఊహించొద్దు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

పొన్నూరు: సాధ్యమైనంత వరకే తమ శాఖలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని, అద్భుతాలు జరుగుతాయని మాత్రం ఊహించవద్దని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని కట్టెంపూడి, దండమూడి మీదుగా మామిళ్లపల్లి గ్రామం వరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ.5 కోట్ల 19 లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కట్టెంపూడి గ్రామ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. రోడ్ల కంటే ఇళ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కొన్ని కంపెనీలతో మాట్లాడితే రాష్ట్ర పరిస్థితి బాగోలేదని, ఇక్కడకు రాలేమని చెప్పారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక టీడీపీ ప్రభుత్వం పతనమవుతుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఓ కార్యకర్త ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఖండించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కూటమి నాయకులు వడ్రాణం మార్కండేయబాబు, డేగల ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

డిస్కౌంట్లు మెడికల్ షాపుల మనుగడకే ప్రమాదం

రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కేపీ రంగారావు



కొత్త కార్యవర్గ సభ్యులతో రంగారావు

గుంటూరు మెడికల్: వినియోగదారునికి 22 శాతం డిస్కౌంట్ ఇస్తూ కేవలం 5 నుంచి 6 శాతం లాభాలను హోల్‌సేల్, రిటైలర్స్ పంచుకోవడం వల్ల మెడికల్ షాపుల మనుగడకు తీవ్ర విఘాతం కలుగుతోందని రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కేపీ రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు, వడ్డీలు చెల్లించలేక నిర్వాహకులు షాపులను మూసివేసి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొనడం బాధాకరమని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్రీస్ పిలుపుమేరకు హోల్ సేల్, రిటైల్ మెడికల్ షాపులు డిస్కౌంట్లను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆల్ ఇండియా కెమిస్ట్రీస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కొత్త తొలి జనరల్ బాడీ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం గుంటూరు లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు జీఎస్ఎస్ ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న మందుల షాపుల నిర్వాహకులు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. రెన్యూవల్స్ తీసుకుని, జిల్లా అసోసియేషన్ చేపట్టే అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాలుపంచుకోవాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి కె చంద్రశేఖరరావు వార్షిక నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.సుబ్బారావు, కోశాధికారి టీవీ సుబ్రహ్మణ్యం సీనియర్ సభ్యులు బీవీ ప్రసాద రావు, కే శివ శంకరరావు, రిటైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ సాయిరాం పాల్గొన్నారు.

పెన్షనర్లకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పెన్షనర్లకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేట తాలూకా ప్రాంగణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీలో తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను పునరుద్ధరించుకోవడంతో పాటు బకాయిలను సాధించుకునేందుకు జేఏసీతో కలసి కృషి చేస్తామని తెలిపారు. సంఘ పటిష్టతకు జిల్లా శాఖలు, తాలూకా యూనిట్లు కృషి చేయాలని అన్నారు. సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు జీఎస్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ యూనిట్ల పటిష్టతకు కృషి చేయడంతో పాటు పెన్షనర్లు సమాజసేవ చేయాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు మాట్లాడుతూ పెన్షనర్లకు హెల్త్‌కార్డులపై అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల జబ్బులకు నగదు రహిత చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులందరూ సంఘంలో సభ్యులుగా చేరాలని అన్నారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.పెద్దన్న గౌడ్ మాట్లాడుతూ ఈహెచ్ఎస్‌ను పూర్తి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్‌కు బదులు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.వెయ్యికోట్లతో నిధిని ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి టీవీఎస్ఎస్ఆర్ఏ శర్మతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి

- రూ 3,12,750 నగదుతో 24 మంది జూదరులు అరెస్ట్
- రెండు కార్లు, రెండు ఆటోలు, ఏడు ద్విచక్రవాహనాలు, 24 సెల్ ఫోన్లు స్వాధీనం



జూదరుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 24 మంది జూదరులను అరెస్ట్ చేసి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు కాజ పరిధిలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా బైబిల్ మిషన్ వెనుక గల మామిడితోటలో పేకాట జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడిచేశారు. 24 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,12,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రెండు కార్లు, రెండు ఆటోలు, ఏడు ద్విచక్రవాహనాలు, 24 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

బెల్లంకొండ మండలంలో అధిక వర్షపాతం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో బెల్లంకొండ మండలంలో అత్యధికంగా 15.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 28 మండలాల్లో 160 మి.మీ. వర్షపాతం కురిసింది. మండలాల వారీగా గమనిస్తే.. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 3.8 మి.మీ., మాచర్లలో 4.4, వెల్దుర్తి, యడ్లపాడు మండలాల్లో 2.2, దుర్గిలో 5.2, రెంటచింతల, అచ్చంపేట మండలాల్లో 4.6, గురజాలలో 6, దాచేపల్లిలో 12.2, కారంపూడి, బొల్లాపల్లి మండలాల్లో 6.4 మి.మీ. చొప్పున వర్షం కురిసింది. పిడుగురాళ్లలో 9.4, మాచవరంలో 1.2, క్రోసూరు, నూజెండ్ల మండలాల్లో 4.8, అమరావతిలో 6.2, పెదకూరపాడులో 4.0, సత్తెనపల్లిలో 7.6, రాజుపాలెంలో 9.2, నకరికల్లులో 10.2, వినుకొండ, ముప్పాళ్ల మండలాల్లో 4.2, శావల్యాపురంలో 7.4, ఈపూరులో 5.2, రొంపిచర్ల, చిలకలూరిపేట మండలాల్లో 2.4, నాదెండ్లలో 3.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

రైల్వేస్టేషన్‌లో దోపిడీకి యత్నం

కత్తితో ఆగంతకుడి దాడి

తెనాలి రూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌లో వేచి చూస్తున్న వ్యక్తిపై గుర్తు తెలియని దుండగుడు దోపిడీకి యత్నించి కత్తితో దాడి చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పాండురంగపేటకు చెందిన పాతూరి రాజ మార్కెట్ వంతెన వద్ద కొబ్బరికాయల వ్యాపారి. శనివారం రాత్రి 12 గంటల సమయంలో వైజాగ్ నుంచి తన మేనల్లుడు వస్తుండటంతో అతడిని తీసుకువెళ్లేందుకు స్టేషన్‌లోని 3వ నంబర్ ప్లాట్‌ఫాంపై రాజ వేచి చూస్తుండగా గుర్తు తెలియని ఆగంతకుడు వచ్చి మాటల్లో పెట్టాడు. రాజ జేబులోని సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యేందుకు యత్నించాడు. వెంటనే తేరుకున్న బాధితుడు రాజ అతడిని పట్టుకుని నిలువరించే యత్నం చేయగా జేబులోని కత్తితో భుజంపై మూడుసార్లు పొడిచాడు. దీంతో బాధితుడు రాజ కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కత్తితో దాడి చేసిన సమయంలో ఆ కత్తి ఒరలో ఉందని అదే కనుక ఒరలో నుంచి తీసి నేరుగా దాడి చేసినట్లైతే తీవ్ర ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడేదని బాధితుడు తెలిపాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని వివరించాడు. ఘటనపై జీఆర్పీ పోలీసులు విచారణ చేపట్టారు.

155 మద్యం సీసాల స్వాధీనం



మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో రూ. 30 వేల విలువైన 155 మద్యం సీసాల్ని సీఐ ఎస్.వి.రాజశేఖర్ రెడ్డి బృందం ఆదివారం స్వాధీనం చేసుకుంది. ఏఎస్ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాలు.. స్థానిక కిశోర్ కాలనీకి చెందిన నాగండ్ల రవికిరణ్ బాబు అక్రమంగా మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నాడనే ముందస్తు సమాచారంతో పోలీసులు నిఘా ఉంచారు. అందులో భాగంగా స్థానిక కొణిదెన రోడ్డులో రవికిరణ్ బాబును తనిఖీ చేశారు. అతని వద్ద 155 మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

స్థల వివాదంలో ఇరు వర్గాల ఘర్షణ



ఎన్నాదేవిలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వారు

సత్తెనపల్లి: స్థల వివాదంలో సత్తెనపల్లి మండలం ఎన్నాదేవిలో బంధువులైన ఇరువర్గాల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నాదేవి గ్రామంలో 117 గజాల కాలిబాటకు సంబంధించిన స్థల వివాదం సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆదివారం ఆ స్థలంలో రమాదేవి, సుబ్బాయమ్మ తదితరులు మొక్కలు నాటడంతో ప్రత్యర్థి వర్గం ప్రశ్నించింది. మహిళల మధ్య వివాదం పెరిగి, వారి భర్తలు రంగంలోకి దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మాదంశెట్టి లక్ష్మి ఫిర్యాదు మేరకు రమాదేవి, సుబ్బాయమ్మ, శంకర్‌లపై కేసు నమోదు అయింది. రాట్నాల శంకర్ ఫిర్యాదు మేరకు మాదంశెట్టి కొండలు, లక్ష్మి, త్రివేణి, హుస్సేన్ రావు, పద్మావతి, హేమలపై కౌంటర్ కేసు నమోదు చేసినట్లు సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ కరీముల్లారావు తెలిపారు.

గురుపూర్ణిమ పూజలు



పెదవడ్లపూడిలో సాయిబాబాను దర్శించుకున్న రాష్ట్ర సీసీఎల్ఏ జయలక్ష్మి దంపతులు



పెదవడ్లపూడిలో సాయిబాబాను దర్శించుకున్న మహిళా శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ వైఎస్ పాల్‌రెడ్డి దంపతులకు స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు